పెనమలూరు.. అభివృద్ధి జోరు

- రూ. 6.44 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- రూ. 5 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం
- గ్రామంలో ప్రధాన రహదారులకు మోక్షం

నియోజకవర్గ కేంద్రంలో ప్రగతి ప్రకాశం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సబ్‌స్టేషన్



సీసీ రోడ్డుగా నిర్మాణం చేసిన చెరువు కట్ట రోడ్డు

పెనమలూరు: నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ఈ గ్రామాన్ని గత పాలకుల హయాంలో అభివృద్ధి పనులు చేయకపోవడంతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెనమలూరు దశ మారిపోయింది. అభివృద్ధికి ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవ, గ్రామ పంచాయతీ పాలకుల కృషితో పెనమలూరు గ్రామ రూపురేఖలు మారుతున్నాయి

రూ.6.44 కోట్లతో అభివృద్ధి

పెనమలూరు గ్రామంలో రూ.6.44 కోట్లతో 53 అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో రూ.2.79 కోట్లతో 20 అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మరో 9 పనులు రూ.1.83 కోట్లతో జరుగుతున్నాయి. ఇంకా రూ.1.81 కోట్లతో త్వరలో పనులు ప్రారంభించనున్నారు. గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న చాలా సమస్యలకు పాలకులు పరిష్కారం చూపారు. ప్రధానంగా అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా మార్చారు.

రహదారులకు మోక్షం

గ్రామంలో చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోని పలు ప్రధాన రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.60 లక్షలతో పల్లిపేట ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించారు. రూ.30 లక్షలతో మసీదు వద్ద చెరువు కట్ట రోడ్డు నిర్మించారు. రూ.20 లక్షలతో అన్నే బాబూరావు కాలనీ రోడ్డు, శ్మశానవాటిక వద్ద రూ. 29 లక్షలతో రోడ్డు, జగనన్న కాలనీలో రూ.15 లక్షలతో ప్రధాన రోడ్డు నిర్మించారు.

రూ.1.20 కోట్లతో భవనాల నిర్మాణం

గ్రామంలో మూడు సచివాలయాల నిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేశారు. సచివాలయాల భవనాల నిర్మాణం తుది దశలో ఉంది. మరో రూ. 25 లక్షలతో గ్రంథాలయ భవనం నిర్మించారు. త్వరలో రైతుభరోసా కేంద్రం భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నారు.

రూ. 5 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్

పెనమలూరు గ్రామంలో పాటు పరిసర గ్రామాలు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటానికి రూ.5 కోట్లతో ప్రభు త్వం ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది. చాలా కాలంగా గ్రామంలో అత్యాధునిక సబ్‌స్టేషన్ నిర్మాణం చేయాలనే ప్రతిపాదనలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పెనమలూరులో సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంది. గ్రామంలో ఇంకా దాదాపు రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. జరుగుతున్న అభివృద్ధితో పెనమలూరు గ్రామం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది.

అభివృద్ధిలో రాజీలేదు..



పెనమలూరు గ్రామ అభివృద్ధిలో రాజీలేకుండా పని చేస్తున్నాం. ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు, గ్రామస్తులు, పార్టీ శ్రేణులు పూర్తిగా సహకరించటంతోనే ప్రగతి సాధ్యమవుతోంది. రానున్న రోజుల్లో మరింత వేగవంతంగా పనులు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తాం.

– లింగాల భాస్కరరావు, సర్పంచ్, పెనమలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో ముమ్మరంగా ప్రవేశాలు



పెనమలూరు పాఠశాలలో చేరడానికి వచ్చిన విద్యార్థులు

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అడ్మిషన్ల కోసం పెద్ద సంఖ్యలో తరలి రావటంతో పాఠశాలలు కిటకిటలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చింది. మనబడి నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలను సమగ్రంగా మార్చింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు బోధించడంతోపాటు జగనన్న విద్యా కానుకగా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు కూడా ఉచితంగా అందజేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లకు పోటీ పెరిగింది. అడ్మిషన్లతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. ఉదాహరణకు గత విద్యాసంవత్సరంలో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు దాదాపు 1200 మంది విద్యార్థులు చదివారు. ఈ సారి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆ స్కూలు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ పాఠశాలను నాడు–నేడు కింద రూ.కోటితో అభివృద్ధి చేశారు. మౌలిక వసతులు కల్పించారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి ఇలా అనేక పథకాలు విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారు. ప్రయోగశాల, గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. మండలం పరిధిలో 35 ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్య తరగతి విద్యార్థులు అందుబాటులో ఉన్నాయి.

అడ్మిషన్‌లు బాగున్నాయి

పెనమలూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.దుర్గా భవాని మాట్లాడుతూ.. తమ పాఠశాలలో అడ్మిషన్‌లు పెరిగాయన్నారు. తమ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ప్లస్‌టు వరకు తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలికలకు ఇంటర్‌మీడియెట్ విద్య స్థానికంగానే అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు బైపీసీ, ఎంపీసీ గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంటర్ మీడియట్ విద్యాబోధనకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా నియమించిందని తెలిపారు. ఎటువంటి ఫీజులు లేకుండా బాలికలకు ఇంటర్‌మీడియెట్ కోర్సులు చదువుకోవచ్చని సూచించారు.

యాజమాన్య చర్యలతో చెరకులో అధిక దిగుబడులు



చెరకు పంటను పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తదితరులు

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో చెరకు సాగులో అధిక దిగుబడులు సాధించొచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం కీటక నివారణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. కేసీపీ డీజీఎం సూర్యారావు, సిబ్బందితో కలిసి కపిలేశ్వరపురం, పైడికొండల పాలెం, వీరంకిలాకు, కంకిపాడు గ్రామాల్లో చెరకు పంట పొలాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో చెరకు పైరులో రసం పీల్చే పురుగు, ఎర్రనల్లి, తెల్లదోమ ఆశించి పంటకు నష్టం గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ.. ఎర్రనల్లి గడ్డి జాతి మొక్కలపై ఆశిస్తుందన్నారు. గట్లను శుభ్రంగా ఉంచుకోవాలని, చెరుకు మొవ్వులో ఎనిమిది ఆకులు మినహా మిగిలిన వాటిని తొలగించాలని సూచించారు. కరిగే గంధకం పొడి మూడు గ్రాములు లేదా డైమిథోయేట్ 1.7 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి ఆకులు అడుగు భాగం కలిసేలా పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీలీటర్లు లేదా ఎసిటామిప్రిడ్ 0.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయటం ద్వారా పంటను కాపాడుకోవచ్చని సూచించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సత్వర రుణాలు

బీఓఐ ఎంఎస్‌ఎంఈ జోనల్ హెడ్ జయకృష్ణ


హనుమాన్‌జంక్షన్ రూరల్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అతి తక్కువ వడ్డీ రేట్లతో సత్వర రుణాలను మంజూరు చేస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఎంఎస్ఎంఈ హెడ్ పి.జయకృష్ణ తెలిపారు. స్థానిక విజయవాడరోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఎంఎస్ఎంఈ హెడ్ జయకృష్ణ మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో విజయవాడ జోన్ పరిధిలో రూ.130 కోట్ల పారిశ్రామిక రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. 2023–24 ఏడాదిలో మరింత అధికంగా రూ.165 కోట్ల రుణాల మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటును ప్రోత్సహించేందుకు విజయవాడ జోనల్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశ్రమల స్థాపనకు గరిష్ఠంగా రూ.25 కోట్ల వరకు రుణాలను మంజూరు చేస్తామని జయకృష్ణ తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఎలాంటి హామీ లేని ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ బోడ్డేపల్లి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

భూ సార పరీక్షలు చేయించాలి



ఉయ్యూరు: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిస్సీ గ్రేస్ సూచించారు. మండలంలోని కలవపాముల, బోళ్లపాడు గ్రామాల్లో మట్టి నమూనా సేకరణపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. నిస్సీ గ్రేస్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే భూమికి అవసరమైన ఎరువులను వినియోగించాలని స్పష్టంచేశారు. సాగు ఖర్చులను నియంత్రించేందుకు మట్టి నమూనా పరీక్షలు దోహదపడతాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాస్, ఏఓ పద్మజ, కలవపాముల సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి, ప్రతినిధులు గంటా పూర్ణచంద్రరావు, తుమ్మూరు సంజీవరెడ్డి, చాగంటి శివారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఏపీపీఏసీఎస్‌ఈఏ మండల కన్వీనర్‌గా బాలజీ



గన్నవరం: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈఓలు, సంఘ సిబ్బంది అసోసియేషన్ (ఏపీపీఏసీఎస్ ఈఏ) గన్నవరం మండల శాఖ కన్వీనర్‌గా బుద్దవరం సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ కొండపల్లి బాలాజీ ఎన్నికయ్యారు. స్థానిక కేడీసీసీ బ్యాంక్ ఆవరణలో మంగళవారం జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్, సహకార సంఘాల ఉద్యోగులు, సిబ్బంది బాలాజీని పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి, ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. సంఘం మండల కన్వీనర్‌గా ఎన్నుకున్నందుకు కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జోగేశ్వరరావు



నున్నలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కపూర్ తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జగనన్న కాలనీలో లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో అధికారులు చొరవ చూపాలని బాపులపాడు ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు ఆదేశించారు. మండల కేంద్రమైన బాపులపాడులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం రాయితీపై ఇసుక, సిమెంట్, ఐరన్ సరఫరా చేస్తోందని లబ్ధిదారులకు వివరించారు. మండలంలో 2,613 మందికి గృహ రుణాలు మంజూరు చేయగా, 1,132 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని, 372 ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని ఎంపీడీఓకు హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ వివరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

నున్న(విజయవాడరూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి.కపూర్ సూచించారు. నున్న గ్రామంలోని విజయవాడ నగరపాలక సంస్థ, విజయవాడ రూరల్ మండలానికి సంబంధించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. విజయవాడ రూరల్ లే అవుట్‌లో 4,600 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 1000 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని ఏఈ రామకృష్ణారావు తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉండటాన్ని ఈఈ కపూర్ పరిశీలించారు. విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించి 37,010 ఇళ్లకు 2,450 ఇళ్ల నిర్మాణ పూర్తవగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రవికాంత్ తెలిపారు. నిర్మాణం పూర్తయి లబ్ధిదారులు నివసిస్తున్న ఇళ్లను ఈ సందర్భంగా అధికారులు పరిశీలించారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన



వెల్దిపాడులో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

ఉంగుటూరు: ఉపాధి హామీ పథకంలో పాల్గొనే ప్రతి కూలీకి రోజుకు రూ.272 కూలి వచ్చేలా పని కల్పించాలని ఎంపీడీఓ శేషగిరిరావు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వెల్దిపాడులో చేపడుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితమైన కొలతలతో కాలవలు పూడిక తీయాలని సూచించారు. పంట కాలువ పూడికలు తీయడం వల్ల కాలువకు అనుసంధానమైన చిన్న కాలువలకు నీరు సక్రమంగా ప్రవహిస్తుందన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని చూపించాలని సూచించారు. పనికి వచ్చిన వారికే మస్టర్ వేయాలని, రాని వారికి మస్టర్ వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ నాగరత్నం, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యతోనే పేదల అభ్యున్నతి సాధ్యం



కంకిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న బాకీ బాబు



వీరపనేనిగూడెంలో జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న అన్నవరపు ఎలిజబెత్ రాణి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న అల్లాపురం సర్పంచి

కంకిపాడు: పేదల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. బాకీ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్‌లను సకాలంలో అందిస్తూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, హెచ్‌ఎం జి.బి.కె.సుధారాణి, జువ్వనపూడి పకీర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. ప్రతి పేద బిడ్డ ఉన్నత చదవు చదువుకోవాలన్నదే జగనన్న ఆశయం అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న కిట్లలో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్, బ్యాగ్‌ను కిట్ రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న విద్యా కానుకల పంపిణీ

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి జగనన్న విద్యా కానుకలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మి ఆచరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మన బడి నాడు–నేడు పథకంతో పాఠశాలల దశ, దిశ మార్చి వాటిని ఎంతో ఆధునికంగా వసతులతో తయారు చేశారని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చారని, పేద ఇంటి బిడ్డలు ఉన్నత విద్యావంతులుగా ఎదగడానికి బాటలు వేశారని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నందిపాటి సుబ్బారెడ్డి, చిలకపాటి మోహనరావు, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం తోడ్పాటు

అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచి దొక్కు సాంబ శివవెంకన్నబాబు చేతుల మీదుగా జేవీకే కిట్లను అందజేశారు. సర్పంచి మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సదుపాయలను సమకూర్చడంతో పాటు పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉప సర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.పద్మ, హెచ్‌ఎం సీహెచ్. శేషాకుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఎక్స్‌రే- శ్రీశ్రీ అవార్డు ప్రదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15 తేదీ గురువారం నాటక, సినీరంగ ప్రముఖులు, ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి 'అన్న' (వెంకటేశ్వర్లు)కు ఎక్స్‌రే-శ్రీశ్రీ అవార్డు బహూకరించనున్నట్లు ఎక్స్‌రే అధ్యక్షులు కొల్లూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ, జీఆర్‌కే పోలవరపు కళాసమితి సంయుక్త ఆధ్వర్యాన ఎక్స్‌రే-శ్రీశ్రీ అవార్డు బహూకరణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయం ప్రారంభం



ఉయ్యూరు: ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో పెనమలూరు నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. వల్లూరుపాలెంలో జీవన్‌కుమార్‌ది హత్యేనన్నారు. ఆత్మహత్యగా చిత్రీకరించటంపై న్యాయపోరాటం చేస్తామన్నారు. వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు పేటేటి ప్రభాకర్, భాను, మట్టా పూర్ణ, వల్లూరు కుమార్, వినయ్, పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కొడాలి రాజేష్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నేటి నుంచి రూరల్ మండలంలో రీసర్వే

విజయవాడ రూరల్: మండలంలో బుధవారం నుంచి రీ సర్వే ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. తన కార్యాలయంలో ఆమె మంగళవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. అంబాపురం, రాయనపాడు, పైడూరుపాడు, కొత్తూరు, తాడేపల్లి, వేమవరం, షాబాదు, జక్కంపూడి, పి.నైనవరంలో రీ సర్వే నిర్వహించాలన్నారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. నాలా రికార్డులు పెండింగ్‌లో ఉండరాదని, స్పందన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, వెబ్ ల్యాండ్ నమోదు, ఇతర పనులను పెండింగ్‌లో ఉంచొద్దని వీఆర్వోలకు సూచించారు. డెప్యూటీ తహసీల్దారు సలీమ్, మండల సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉయ్యూరు: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజరు ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలపై ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించొచ్చని సూచించారు. ప్రజలు 99592 24796కు ఫోన్ చేయాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవన్‌లో ఈ నెల 15వ తేదీన ఉచిత కంటి, దంత వైద్య శిబిరం జరుగుతుందని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గన్నవరం తాలుకా అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు మంగళవారం తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: మండలంలోని గంగూరు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదుచేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్ బాబు కథనం మేరకు.. పామర్రు మండలం అడ్డాడ గ్రామానికి చెందిన గురువిందపల్లి వీరమ్మ గుడివాడలో పండ్ల వ్యాపారం చేస్తోంది. మామిడి పండ్లు కొనుగోలు చేయటానికి ఆమె ఆటోలో విజయవాడ బయలుదేరింది. డ్రైవర్ సురేష్ నిర్లక్ష్యంగా ఆటో నడపటంతో గంగూరు గ్రామం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వీరమ్మ, డ్రైవర్ భార్య భార్గవి గాయపడ్డారు. వారిని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెలకు గాయాలు

పెనమలూరు: మండలంలోని గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెలు గాయపడ్డారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్ బాబు కథనం మేరకు.. పోరంకి శివాలయం ప్రాంతానికి చెందిన రాచాబత్తుల రాధిక, ఆమె తండ్రి గుర్రం నాగమణి బైక్‌పై సోమవారం గుడివాడకు వెళ్లారు. వారు పని ముగించుకుని తిరిగి బైక్ పై బయలుదేరి గంగూరు వద్దకు రాగా ఓ కారు వారిని ఢీకొట్టింది. రాధిక, నాగమణి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోరంకిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అత్యవసర వైద్య చికిత్స కోసం చేర్చారు. రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

బాపులపాడు ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.జోగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై బాపులపాడు ఎంపీడీఓగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోగేశ్వరరావుకు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

24న బహిరంగ వేలం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీవరకు ఆలయంలోని కొబ్బరి చెక్కలు పోగు చేసుకోవటానికి, ఆలయంలోని ఖాళీ స్థలంలో పూజా సామగ్రి విక్రయించుకునే హక్కుకు ఈ నెల 24వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఆలయం ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సమక్షంలో బహిరంగ వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే హక్కు కోసం రూ. 15 వేలు, పూజా సామగ్రి విక్రయానికి స్థల హక్కు కోసం రూ.10 వేల ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని వివరించారు. అత్యధిక మొత్తానికి పాడుకున్న పాటదారునికి ఏడాది పాటు హక్కు కల్పిస్తారని తెలిపారు.